అదితి గజపతిరాజుకు అభినందన వెల్లువ

రాజాం, ఎస్ కోట, ఎమ్మెల్యేలు అభినందన

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: విజయనగరం అసెంబ్లీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా విజయం సాధించిన పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజుకు అభిమానులు అభినందన వెల్లులతో గణ సత్కారాలు చేశారు. గురువారం రాజాం, ఎస్ కోట నియోజకవర్గ ఎమ్మెల్యేలు కొండ్రు మురళి, కోళ్ల లలిత కుమారి , పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు, ద్వారపురెడ్డి జగదీష్ బంగ్లాకు వెళ్లి ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ను దుస్సాలువతో సన్మానించారు, అదితి గెలుపు చారిత్రాతిక విజయమని విజయనగరం నియోజకవర్గ అభివృద్ధికి శుభ సూచకమని కొనియాడారు. జిల్లా నలుమూలల నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న అశోక్ కుటుంబీకులు



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం శ్రీ పైడితల్లి అమ్మవారినిగురువారం ఆలయ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు దంపతులు, కుమార్తె అధిపతి విజయలక్ష్మి దర్శించుకున్నారు. దేవస్థానం ఇఓ డివివి ప్రసాదరావు, ఆలయవేదపండితులు అశోక్ గజపతిరాజు కుటుంబీకులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి పూజలు నిర్వహించుకున్న అశోక్ గజపతిరాజుకు అర్చకులు ఆలయ మర్యాదలు అనుసరించి తలపాగా చుట్టారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థినిగా విజయసాధించిన అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి విజయలక్ష్మి కూడా అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. విజయోత్సవం అనంతరం ప్రప్రధమంగా ఆలయానికి విచ్చేసిన అదితి విజయలక్ష్మికి ఆలయంవద్ద ప్రజలు చూడడానికి విచ్చేసి మనః పూర్వక అభినందనలు తెలిపారు. అశోక్ కుటుంబీకులకు ఆలయవేద పండితులు, అర్చ కులు వేదాశీర్వచనాలు చేసి అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేసారు.

మాజీ కేంద్రమంత్రి అశోక్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజుని కలిసిన ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు, విజయ నగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఎస్.కోట వైస్ ఎంపీపీ ఇందూకూరి సుధారాణి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ విజయనగరంలో గల తన స్వగృహం అయిన అశోక్ బంగ్లాలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం లలిత కుమారి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు భయాన్ని వీడి స్వేచ్ఛగా కసితో ఓటు వేశారని, ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్న తొమ్మిదికి తొమ్మిది సీట్లని మంచి మెజారిటీతో మహిళలు, యువత, మేధావులు ఇలా అన్ని వర్గాలు కూటమికి పట్టం కట్టారన్నారు. ఈ కార్యక్రమంలోఎస్.కోట నియోజకవర్గ ఐదు మండలాల తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

టీడీపీ భారీ విజయానికి మూలస్తంభం నారా లోకేష్

కిమిడి రామ్ మల్లిక్ నాయుడు

విశాలాంధ్ర-చీపురుపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో యువగలం పేరుతో పాద యాత్ర ప్రారంభించి పాదయాత్రను ప్రజాగళంగా మార్చి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలను ఏకతాటిపై నడిపించిన ప్రజా నాయకుడు తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్మల్లిక్ నాయుడు అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ ప్రజల్లో తెలుగుదేశం పార్టీ పట్ల విశ్వాసాన్ని పెంచి, తెలుగుదేశం పార్టీ అఖండ విజయానికి మూలకారణం అయ్యారని రామ్ మల్లిక్ నాయుడు అన్నారు. నారా లోకేష్ చేసిన పాదయాత్ర తో పాటు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయానికి కృషిచేసిన జనసేన , బిజెపి నాయకులు, కార్యకర్తలు సంఘీభావం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుందని అన్నారు. ఇంతటి విజయాన్ని చేకూర్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, నారా లోకేష్‌కు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ బిజెపి అగ్ర నాయకులకు ఆయన ఈ సందర్భంగా శుభాకాంక్షలు, ధన్యవాదాలు తెలియజేశారు.

లలితమ్మకు అభినందనల వెల్లువ

ఎమ్మెల్యేను సత్కరిస్తున్న జెడి వలస గ్రామస్థులు, నేతలు

విశాలాంధ్ర-జామి: ఎస్‌కోట ఎమ్మెల్యేగా గెలుపొందిన కోళ్ళ లలితకుమారిని అభినందించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వివిద రకాల వర్గాల ప్రజలు తరలివస్తున్నారు. గత రెండు రోజులుగా లక్కవరపు కోటలోని ఆమె నివాసంలో పండగ వాతావరణం నెల కొంది. నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు అభిమానులు, నేతలు, నాయకుల తాకిడి ఎక్కువగా ఉంది. జామి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన నేతలు, కార్యకర్తలు వెళ్ళి లలితమ్మకు ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేస్తున్నారు. నన్ను ఎంతో అభిమానించి గెలిపించిన ప్రజలకు అన్ని విదాలా అండగా ఉంటానని లలితమ్మ భరోసా ఇస్తున్నారు. మరోవైపు వివిద శాఖల అధికారులు, వివిద రంగాలలో పెద్దలు వచ్చి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె. రాంప్రసాద్‌ను కలిసి అభినందనలు తెలియజేస్తున్నారు.

కూటమి ఎమ్మెల్యే బేబీనాయన కు ఘన సన్మానం

విశాలాంధ్ర-బొబ్బిలి: కూటమి ఎమ్మె ల్యే బేబీ నాయన ఎమ్మెల్యే అభ్యర్థిగా అఖండ విజయం సాధించిన సందర్భంగాబీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ళ సురేంద్ర గురువారం రాజా ప్యాలెస్‌లో అభినందనలు తెలిపి ఉత్తరాంధ్ర ఇలవేలుపు శ్రీ నూకంబిక అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదం అందజేసి ఘనంగా సాలువ కప్పి సత్కరించారు ఈ సందర్భంగా మళ్ళ సురేంద్ర మాట్లాడుతూ రాజవంశీకలైన అయినా బేబీ నాయన కి నియోజకవర్గం ప్రజలు అఖండ మెజార్టీతో గెలిపించి తమ రాజకీయ జీవితానికి మొదట అడుగు వేశారని, చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో రాష్ట్ర మంత్రివర్గంలో మంచి స్థానం పొంది నియోజవర్గాన్ని మరింత అభివృద్ధి పరచాలని శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలోఅనకాపల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాయల మురళీధర్, పిట్ల రాజు, తిప్పన అప్పారావు, ఎండకుర్తి అప్పలరాజు, ఎస్. భానుచందర్ (అఖి), జొన్నాడ సురేష్, సతీష్, సాగర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వర్షాలు కురిస్తేనే మంచి దిగుబడి

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో జూన్ మొదటివారం వర్షాలు పడటంతో రైతన్నలు భూమి సాగుచేసుకుని కరీఫ్ పంటలకు మొగ్గు చూపుతున్నారు. అలాగే రైతన్నలు పూర్వం పద్ధతిలో ఏరువాక సాగించుకుని, చెనగ పిక్కల మాదిరిగా జొన్న పిక్కలు వేసుకుంటున్నారు. సకాలంలో వర్షాలు కురుస్తూ రైతు సంతోషంగా ఉంటాడని పంటలు కలసి వస్తాయని లేకపోతే పంటలు దెబ్బతిని అప్పులు ఊబిలో కూరుకుపోతామని రైతన్నలు అంటున్నారు.

ప్రజలు మెరుగైన అభివృద్ధి కోరుకోవడమే మా ఓటమికి కారణం

- ఇచ్చిన హామీలు వంద శాతం నెరవేర్చాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వంపై ఉంది
- మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర-విజయనగరం: ఇచ్చిన హామీలు శతశాతం అమలు చేయా ల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వంపై వుందని మాజీ మంత్రి బొత్స సత్య నారాయణ అన్నారు. విజయనగరంలో సోదరుడు అప్పలనర్సయ్య స్వగృహం లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తాము చేసిన సంక్షేమం, అభివృద్ధి కన్నా మెరుగైన పాలనను ప్రజలు కోరుకోవడమే తమ ఓటమికి కారణంగా భావిస్తున్నామని బొత్స అన్నారు. ప్రతిరోజూ వచ్చే ఉదయం, సాయంత్రంలా గెలుపు, ఓటములు సంభవిస్తాయన్నారు. ఎన్నికల్లో పోటీచేసి ఓటమి పాలైన ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు, ప్రజాప్రతినిధులతో కలసి మంత్రి బొత్స మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ ఓటమికి ఒక్క జగన్నే బాధ్యున్ని చేయడం సరికాదని, ఓటమిలో తామంతా భాగస్వాములమేనని అన్నారు. ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని, గత ఐదేళ్లుగా తమకు మంచిపాలన అందించే అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలి పారు. భవిష్యత్‌లో కూడా ప్రజల కు, వైసీపీ శ్రేణులకు అండగా ఉంటాయని బొత్స భరోసా ఇచ్చారు. తాము చేయగా మిగిలిన అరకొర అభివృద్ధి పనులను పూర్తిచేయాల్సిన బాధ్యత, సిపిఎస్, డిఎస్సీ నోటి ఫికేషన్ వంటి ఇచ్చిన హామీలను వందశాతం నెరవేర్చాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వంపై ఉందన్నారు. సమావేశంలో ఉమ్మడి విజయనగరం జిల్లా వైసీపీ అభ్యర్థులు, వైసీపీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు అంతం

పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: వైకాపా ప్రభుత్వం అరాచక పాలనకు ప్రజలు అంతం పలికారని పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. గురువారం పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దౌర్జన్యలు చేసే నాయకులను ప్రజలు ఇంటికి పంపారన్నారు. కూటమి ఘన విజయం సాధించడానికి ఎంతోమంది కృషి ఉందని తెలిపారు. ఐదేళ్లలో టీడీపీ నాయకులను ఎన్నో ఇబ్బందులు పెట్టారన్నారు. అరెస్టులు, అరాచకాలు చేసి ఇబ్బంది పెట్టారని, నారా లోకేష్ ని ఎన్నో అవహేళనలు, అవమా నాలు చేశారని, అన్ని ఓపికతో భరించి ఈ రోజున ఘన విజయంతో బుద్ధి చెప్పారన్నారు. ఎన్నో ఒడిదుడుకులు తట్టుకొని యువగలం పాదయాత్ర చేశారు, చంద్రబాబు అరెస్ట్ తర్వాత పవన్ కళ్యాణ్ టీడీపీ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచి సపోర్ట్ చేశారు, నిస్వార్థంగా పనిచేసి క్యాడర్‌లో ఉత్సాహం నింపారన్నారు. ఈ రోజున కూటమి విజయంలో ఆయన పాత్ర అమోఘం అన్నారు. మూడో సారి మోడీ హయం లో ఈ రోజున దేశం, రాష్ట్రం బాగుపడుతుందని ఆశిస్తున్నామన్నారు. జిల్లాలో కూటమి విజయంకి సహకరించిన ఇంచార్జిలకి, నాయకులకి, కార్య కర్తలకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఈ అవకాశం వినియోగించు కుంటామన్నారు. అనంతరం విజయ నగరం శాసన సభ్యు రాలు అతిధి గజపతిరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం ప్రజలు పోటెత్తి ఓటు వేశారని, కూటమి గెలవాలి అని ప్రతీ ఒక్క ఓటరు కోరుకున్నారని, యువత కూడా అధిక సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్నారని, ఆంధ్రప్రదేశ్ రక్షించుకోవాలని తీర్పు ఇచ్చారన్నారు. కూటమి విజయం ద్వారా ప్రజలు అభివృద్ధి కోరుకుంటున్నారని, నరేంద్ర మోడిసహకారంతో రాష్ట్రం అభివృద్ధి చేయడానికి కృషిచేస్తామని ప్రజలు కనీస అవసరాలు మెరుగుపడేలా ఆలోచన చేసి ఉద్యోగ, ఉపాధి, విద్య, వసతులు కల్పన కి పెద్ద పీట వేస్తామన్నారు. ప్రతి పక్ష హోదా కూడా తీసేసి జగన్మోహన్ రెడ్డికి ప్రజలు తమ వ్యతిరేకత చూపించారని తెలిపారు. అక్రమాలు, అరాచకాలను టీడీపీ అరికడతాం, ఇంత ఘనమైన మెజారిటీ ఇచ్చిన విజయనగరం ప్రజలకి కృతజ్ఞతలు తెలిపారు. విజయ నగరంలో మున్సిపల్ కార్పోరేషన్, మండల పార్టీ ఆఫీస్ఎప్పుడో చచ్చిపోయిందని, అందులో ఎవరు ప్రజలకు సేవలు అందించడం లేదని అన్నింటినీ గాడిలో పెడతామన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఐవీపీ రాజు, పిల్లా విజయ్ కుమార్, అవనాపు విజయ్, కర్రోతు నరసింగరావు, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నరసింహారావు పాల్గొన్నారు

సీతం కళాశాలలో జరుగుతున్న గర్ల్స్ బెటాలియన్ ట్రైనింగ్ క్యాంప్ ముగింపు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: స్థానిక గాజుల రేగ పరిధిలో గల సీతం ఇంజనీరింగ్ కళా శాలలో పదోవ రోజు జరుగు తున్న యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపు ముగిసింది. ఈ సదర్భంగా 2(ఆంధ్ర) గర్ల్స్ బట్టలియన్ సి. ఓ కాల్నోల్ గోపెంద్ర మాట్లాడుతూ యువతకు నేటి సమాజంలో ఏటు వంటి సవాలు ఉన్నాయో వాటిని ఎలా ఎదుర్కోవాలో పేర్కొన్నారు. నేషనల్ క్యాడెట్ కార్ప్ ఎన్‌సి దాని ప్రాముఖ్యత పాఠశాలలు, కళా శాలల్లోని విద్యార్థుల కోసం ఒక స్వచ్ఛంద సంస్థ, దాని మూలాలు ఐక్యత, క్రమశిక్షణ, దేశభక్తి భావాన్ని పెంపొందించడంలో లోతుగా పొందుపరిచాయని. యువతను దేశసేవకు అంకితం చేసే బాధ్యతా యుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ శిబిరంలో డిప్యూటీ క్యాంప్ కమండెంట్ కెప్టెన్ మీసాల సత్యవేని, సుబేధర్ మేజర్ బొడ్లే, పరమేశ్వర్ సింగ్, అసోసియేట్ ఎన్.సి.సి ఆఫీసర్స్ లెఫ్టినెంట్ మజ్జి వరలక్ష్మి, థర్డ్ ఆఫీసర్ వెంకట రత్నం, లెఫ్టనెంట్ సంతోషి, థర్డ్ ఆఫీసర్ ఎ. వరలక్ష్మి, తులసి, లక్ష్మి ప్రసన్న, గౌరీ, వెంకట రమణమ్మ, ధనశ్రీ మూడు జిల్లాల నుంచి విచ్చేసిన ఎన్.సి.సి కాడెట్స్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించండి

ఎన్‌సిసి అధికారి

విశాలాంధ్ర -రాజాం: మానవత సంస్థ రాజాం యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక సన్ స్కూల్ ఆవరణలో గురువారం పెద్దఎత్తున మొక్కలు నాటారు. ఎన్సిసి కమాండింగ్ అధికారి ప్రసూన్ పాండా, రెడ్‌క్రాస్ రాజాం యూనిట్ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, మానవత అధ్యక్షులు బీవీ అచ్యుతకుమార్, పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్విజె నాయుడు, రెడ్‌క్రాస్ సభ్యులు పెంకి చైతన్యకుమార్, సన్స్కూల్ ప్రిన్సిపాల్ వై.భారతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమాండింగ్ అధికారి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని చెప్పారు. రాజాంలో ఉద్యమంలా మొక్కలు నాటే కార్యక్రమం చాలా మందికి, చాలా ప్రాంతాల వారికి స్ఫూర్తిదాయకమని అన్నారు.

సతివాడలో తీరని తాగు నీటి కష్టాలు

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో సతివాడ గ్రామంలో మంచినీటి కష్టాలు గ్రామస్తులకు ఇంకా తీరడంలేదు. మంచి నీటి కుళాయిలు నిర్మించారు కానీ ఇళ్లముందు బట్టలు ఆరబెట్టుకోవడానికి పనికి వచ్చాయి తప్ప తాగేటందుకు గోకారం నీరు కూడా రావని దిష్టి బొమ్మల్లా వీధి కుళాయిలు దర్శనం ఇస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. తాగేటందుకు మంచి నీరుకోసం గ్రామంలో ఉన్న పూర్వీకులు కట్టిన నూతి నీరే ఆధారం అని, 30-40 అడుగుల లోతు నుంచి నీరు ఉన్న తోడుకొని ఈ నుయ్య మీరే త్రాగుతున్నాం అని, పూర్వీకుల కష్టాలు ఇంకా మాకు వీడడం లేదని గ్రామం అంతటా కూడా నూతుల్లో నీరు రేఖలతో తోడుకునే ధోరణి మాకు కొనసాగుతుంది అని, వీధి కుళాయిలు ద్వారా మా గ్రామానికి దాహాన్ని తీర్చే నీరుకు మాకు ఎప్పుడు అదృష్టం పడుతుందో అని ఆ గ్రామ ప్రజలు విలేకర్లతో వాపోతున్నారు.

సత్యా గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర -విజయనగరం రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సీతం, సత్య కళాశాలలు వివిధ రకాల మొక్కను నాటారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ భూషణ్ మాట్లాడుతూ పచ్చని చెట్లే ప్రగతికి మెట్లు" అని మనం చెట్ల మీద చాలా ఆధారపడి ఉన్నామన్నారు చెట్లు లేకపోతె మనం బ్రతకలేముని, చెట్లు మనకు ప్రాణవాయువైన ఆక్సిజన్ని ఇవ్వడం జరుగుతుం దన్నారు. చెట్లవల్ల మనకు చాలా లాభాలు ఉన్నాయని. చెట్లు వర్షాలు పడడానికి సహాయం చేస్తాయని చెట్లనుండి చాలా మందులు తయారవు తాయన్నారు. ఎన్నోరోగాలకు ఔషాదాలు చెట్లనుండే తయారవుతాయన్నారు. 2ఏ గర్ల్స్ బాట్టలియన్ సి.ఒ కాల్నోల్ గోపెంద్ర మాట్లాడుతూ 1973 లో మొదటిసారి ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నారన్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం ను జూన్ 5న వేర్వేరు నగరాలలో విభిన్న రీతులలో అంతర్జాతీయ వైభవంగా జరుపుకుంటున్నారు అంటూ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో, క్యాప్టన్ ఏమ్ సత్యావెని ఎఫ్టినెంట్ మజ్జి వరలక్ష్మి, సితం, సత్య యన్.యన్.సి కేడెట్స్ పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో రైతులకు మేలు

వ్యవసాయ శాఖ ఏడిఏ మజ్జి శ్యాంసుందర్

విశాలాంధ్ర-బొబ్బిలి: రైతులు వ్యవసాయ సాగులో నవధాన్యాలు సాగుతో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో సహకరిస్తాయని రైతులు నవధాన్యాలపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ ఏడిఏ మజ్జి శ్యాంసుందర్ పిలుపునిచ్చారు. గురువారం మండలం జగన్నాధపురం కృష్ణాపురం రైతుభరోసా కేంద్రంలో సామూహికంగా నవధాన్యాలు విత్తనాలు కలిపారు. మండల వ్యవసాయ శాఖ ఏడిఏ మజ్జి శ్యాంసుందర్ ఆధ్వర్యంలో నవధాన్యాలు ఉపయోగాలు వాటి గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జగన్నాధపురం సర్పంచ్ బోద్దల సత్యనారాయణ, ఎం పీటీసీ రౌతు తిరుపతిరావు. వ్యసాయ సహాయకురాలు అలజంగి సుస్మిత ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎఫ్ రేఖ. ఎం టి సన్యాసి నాయుడు ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఉరిటి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్‌లను కలిసిన కొండ్రు

విశాలాంధ్ర-రాజాం: రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎన్నికైన కొండ్రు మురళీమోహన్ గురువారం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌లను మర్యాదపూర్వకంగా కలిసారు.

వైభవంగా శ్రీలక్ష్మీ నరసింహునికి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-జామి: మండలంలోని కుమరాంలో ఉన్న శ్రీ ఐశ్వర్య లక్ష్మీనరసింహస్వామి దివ్యఆలయంలో స్వామివారి బ్రహ్మో త్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉత్సవాలలో 16వ రోజుతోపాటు స్వామివారికి ఇష్టమైనరోజు కావడంతో వేదపండితులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈపూజలలో పాల్గొని స్వామివారిసేవలో తరించారు.

రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజం

మాజీ ఎంపీ బెల్లాన

విశాలాంధ్ర-చీపురుపల్లి: రాజకీయాల్లో ప్రతి ఒక్కరికి గెలుపు వాటములు సహజమేనని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విజయనగర పార్లమెంటరీ నియోజకవర్గ ప్రజలకు, ప్రతి ఒక్కరికీ, వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు, ప్రజా ప్రతినిధులకు, పార్టీ కార్యకర్తలకు, అక్కచెల్లమ్మలకు, స్నేహితులకు, శ్రేయోభిలాషులకు, సోషల్ మీడియా మిత్రులకు అందరికీ ఆయన ధన్యవాదాలు. తెలిపారు. రాజకీయాలలో గెలుపు ఓటమిలు సహజం. అని ప్రజాస్వామ్యంలో ప్రతి ప్రజా ప్రతినిధి నాయకుడు ప్రజా తీర్పును అంగీకరించాల్సిందే అన్నారు. ఓటమి, కొంత వేదనకు గురిచేసినప్పటికి, ఇదివరకు ఎలా మీ అందరికీ అందుబాటులో ఉంటూ, సమస్యల పరిస్కారానికి కృషి చేసానో, ఇకపై కూడా అలాగే, తనకు చేతనైన సహాయం చేస్తానుని అన్నారు. ఓటమితో కార్యకర్తలెవ్వరు అధైర్యపడవద్దుని అన్నారు. మన రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన, శాసన సభ్యులకు, పార్లమెంట్ సభ్యులకు బెల్లాన శుభాకాంక్షలు. తెలిపారు.

అశోక్‌ను కలిసిన కోళ్ళ దంపతులు

విశాలాంధ్ర-జామి: తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజును ఎస్‌కోట ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ళ రాంప్రసాద్ దంపతులు గురువారం విజయనగరంలోని అశోక్ బంగ్లాలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికలలో ఎన్‌డిఏ కూటమి భారీ మెజారిటీతో గెలవడంతో పాటు, ఎస్‌కోటలో తాను సైతం భారీ మెజారిటీతో గెలిచిన అనంతరం దంపతులు ఇద్దరు గౌరవార్ధంగా అశోక్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అలాగే విజయనగరం ఎమ్మెల్యేగా గతంలో ఎన్నడూ ఊహించిన విదంగా భారీ మెజారిటీతో గెలిచిన అశోక్ కుమార్తె అదితి గజపతిరాజును అభినం దించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎన్నికలు జరిగిన విధానం, ప్రజలు వైసీపీపై పెట్టుకున్న వ్యతిరేకత తదితర అంంశాలపై చర్చించుకున్నారు. అశోక్‌ను కలిసిన వారి కోళ్ళ దంపతులతోపాటు ఎస్‌కోట వైస్‌ఎంపిపి, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఇందుకూరి సుధారాజు ఉన్నారు.

ధర్మవరంలో ముగిసిన వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఎస్.కోట ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత 30 రోజులుగా జరుగుతున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం గురువారం కోలాహలంగా ముగింపోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంగారు ఉమామహేశ్వరరావు, తానవరపు గోవింద, పుణ్యగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ షేక్ వలీఖాన్, సాఫ్ట్వేర్ అల్లు మహాలక్ష్మి, దోకుల నాయుడు, రిటైర్డ్ ఆర్మీ పోరాపు వెంకటరావు, రిటైర్డ్ ఆర్మీ ఎల్లారావు, రేపాక రాజా, కాపుగంటి సతీష్, సబ్బవరం సతీష్, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, రహీం షేక్ లాల్, ఎల్ వి సత్యనారాయణ, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. టోర్నమెంట్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందించారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు తిలగించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ నెల రోజులుగా జరుగుచున్న బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరానికి క్రీడాకారులకు పాలు, గ్రుడ్డు, షటిల్ కాక్స్, క్రీడా దుస్తులు అందించిన దాతలు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

సత్య కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

విశాలాంధ్ర -విజయనగరం టౌన్: స్థానిక తోటపాలెంలో గల సత్య డిగ్రీ పీజీ కళాశాలలో తేది ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో ఎన్‌సిసి కెడేట్లు మొక్కలు నాటారు. ఈ సంద ర్భంగా కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందని, పర్యావరణ అనుకూల పద్ధతులను అవలంబించడం ద్వారానే ఇది సాధ్యమవుతుందని, దీనికి గాను ప్లాస్టిక్ వినియోగాన్ని కూడా తగ్గించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి మాట్లాడుతూ మన ఇంటి పరిసరాలను, మన వర్క్ ప్లేస్ ను కూడా పచ్చగా వుంచు కోవాలని, ఇండోర్ మొక్కలను కూడా విరివిగా పెంచుకోవాలని మన ఆఫీసులో డెస్క్ పైన కూడా ఒక మొక్కను వుంచడం ద్వారా ప్రకృతి తో సంబంధాన్ని పెంపొందించుకోవడానికి ప్రతి వ్యక్తికి రోజువారీ రిమైండర్ గా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ సి సి ఆఫీసర్ శ్రీ. ఎం. ఉదయ్ కిరణ్, ఎన్ సి సి కెడేట్లు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో వాహనాలకు ఇచ్చే డీజిల్, పెట్రోల్లో వినియెగంలో సిబ్బంది చేతివాటం !

విశాలాంధ్ర-బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల విధులకోసం వినియోగించిన వాహనాలకు ఇచ్చిన పెట్రోల్, డీజిల్ వినియోగంలో కొంతమంది సిబ్బంది చేతివాటం ప్రదర్శించారని కొందరు వాహన డ్రైవర్లు సిబ్బందిపైన తీవ్ర ఆరోపణలు చేశారు. సార్వత్రిక ఎన్నికలు విధులకోసం రెవెన్యూ శాఖ ప్రైవేటు వాహనాలను అద్దెకు తీసుకున్నారు. ఆ వాహనాలకి ఎన్నికల అధికారులు ఇచ్చిన డీజిల్ పెట్రోల్ కొంతమంది కిందస్థాయి సిబ్బంది వాహన యజమానులకు తక్కువ ఇచ్చి ఎక్కువ పెట్రోల్ డీజిల్ వినియోగించినట్లు చెప్పి డీజిల్ పెట్రోలు పక్కతోవ పట్టించారని ఆరోపణలు ఉన్నాయి. వాహనానికి సుమారు 150 లీటర్లు వినియోగించినట్లు అధికారులు రికార్డుల్లో నమోదుచేసిన వాహనాలకు వినియోగానికి అతి తక్కువ లీటర్లు సిబ్బంది ఇచ్చినట్లు వాహన డ్రైవర్లు తీవ్రంగా సిబ్బంది పైన మండిపడ్డారు. వాహనాలకు ఇచ్చే అద్దెలు కూడా నేటి వరకు చెల్లింపులు చేయకపోవడంతో గురువారం తాసిల్దార్ కార్యాలయం ముందు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో తాసిల్దార్ త్రినాధనాయుడు వాహన యజమానులకు చెల్లించ వలసిన అద్దె బకాయిలు చెల్లించారు. డీజిల్ పెట్రోలు చేతివాటానికి పాల్పడిన సిబ్బందిపైన సంబంధిత ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరారు.

కొన్ని ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-రాజాం: రాజాం పురపాలక సంఘ పరిధిలో గల, బొబ్బిలి రోడ్ లో ఎంఈఓ ఆఫీస్ ఎదురుగా తాగునీటి ప్రధాన పైప్‌లైన్ మరమ్మతు పనులు చేపడుతున్నారు. అదనంగా అవసరమైన ఎమ్మెస్ పైప్, ఫ్లాన్జులు ఇతరత్రా సామాన్లు విశాఖ నుంచి రావలసి ఉన్నందున ఈ నెల 07న తాగునీరు సరఫరా నిలిపివేయబడును. ఇందులకు స్థానిక ప్రజలందరూ సహకరిస్తారని కోరు కుంటున్నాం. కావున, అమ్మవారి కాలనీ వద్ద గల 4-950 కేఎల్ కెపాసిటీ వాటర్ ట్యాంక్లు 1-500 కేఎల్ కెపాసిటీ గోపాలపురం వాటర్ ట్యాంక్ నుంచి సరఫరా అగు అమ్మవారికాలనీ, మెంతిపేట ఎస్సీకాలనీ, ఆదర్శనగర్, కొండం పేట, మాదిగ వీధి, బొబ్బిలిరోడ్, తెలగవీధి, చాకలివీధి, వస్త్రపురి కాలనీ, గోపాలపురం, కొత్తవలస, తిమ్మయ్య పేట, మల్లికార్జున కాలనీ లచ్చయ్య పేట తదితర ప్రాంతాలకు 7న తాగునీటి సరఫరా నిలిపివేయడమైనది. సదరు మరమ్మత్తు పనులు పూర్తి అయిన పిమ్మట యధావిధిగా తాగునీరు సరఫరా చేయబడునని తెలివారు.